


శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం



ప్రజాశక్తి - చంద్రగిరి: తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, శ్రీనివాస మంగాపురం నుండి తిరుమలకు వెళ్లే నడకదారి, శ్రీవారి మెట్టు మార్గంలో తాజాగా మళ్లీ చిరుత సంచారం భక్తులలో కలకలం సృష్టించింది. శుక్రవారం ఉదయం 150వ మెట్టు సమీపంలో భక్తులు చిరుతను చూసి కేకలు వేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. చిరుతను చూసిన భక్తులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో, అటవీ ప్రాంతంలోకి చిరుత పారిపోయింది. సమాచారం అందుకున్న టిటిడి సెక్యూరిటీ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులను గుంపులు గుంపులుగా పంపుతున్నారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సాధారణంగా, శ్రీవారి మెట్టు మార్గంలో రాత్రి 6 గంటల తర్వాత భక్తులను అనుమతించరు. వన్యప్రాణుల సంచారం కారణంగా ఈ నిబంధన అమలులో ఉంది. గతంలో కూడా, ముఖ్యంగా సెప్టెంబర్ 2024 మరియు జూన్ 2025లో, ఈ మార్గంలో చిరుతల సంచారం నమోదైంది. ఈ నేపథ్యంలో టిటిడి అధికారులు భక్తులకు తగిన జాగ్రత్తలు చెబుతూ, అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

అన్నదాత సుఖీభవ దరఖాస్తులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల నుండి అంది తహశీల్దార్ లాగిన్‌లలో ఉన్న వెబ్ ల్యాండ్ కరెక్షన్ పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబందించి వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ పెండింగ్ ప్రక్రియ పై డిఆర్‌ఓ నరసింహులుతో కలిసి ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, వి.ఆర్.ఓ.లు, వి.ఎ.ఓ లతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు అంది ప్రస్తుతం తహశీల్దార్ లాగిన్‌లో పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల ఈ కే వై సి పెండింగ్, ఆదార్ నెంబర్ బ్యాంకు ఖాతులకు లింక్ కాక పోవడం, మ్యుటేషన్, రాంగ్ ఆధార వంటి సమస్యలు వలన జిల్లాలో ఇప్పటివరకు 57,096 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఈ పెండింగ్ వల్ల అర్హత కలిగిన రైతులకు నగదు జమ కాలేదని తెలిపారు. తాసిల్దార్ లాగిన్ లో వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ చేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియ రైతులు ఉచితంగా కరెక్షన్స్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంపై వీఆర్వోలు, విఏవోలు రైతులందరికీ పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం రెండవ విడత నవంబర్ మాసంలో, మూడవ విడత జనవరి మాసంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు జమ చేయనున్నదని అర్హత గల రైతులను గుర్తించి లబ్ది పొందేలా సంబందిత వ్యవసాయ అధికారులు చూడాలన్నారు. పెండింగ్ ప్రక్రియ పూర్తయితే ప్రతి రైతుకు నగదు జమ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎక్కువ శాతం దరఖాస్తులు పెండింగ్ ఉన్న మండలాలలో సంబందిత మండలాల తహశీల్దార్లు, వి.ఆర్.ఓ. లు, వి.ఎ.ఓ. లు పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వారం లోపు పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్ కరెక్షన్స్‌పై ఆర్‌డిఓలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ సంబంధించి వి.ఆర్.ఓ. లాగిన్ ప్రక్రియను పూర్తిచేయాలనీ తెలిపారు. ఈ పంటకు సంబందించిన సూపర్ చెక్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఎ పి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయితే పి.ఎం. కిసాన్ నగదు రైతుల ఖాతాలలో జమ అవ్తుందని సంబందిత వ్యవసాయ అధికారులు జిల్లాలోని రైతులందరినీ రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, సహాయ వ్యవసాయ అధికారి ధనంజయ రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ అధికారిణి నాగవర్ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు. అధికారులు రైతుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ఎరువుల సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడండి

జిల్లాలోని రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, ఎ.పి మార్క్ ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పవన్, వ్యవసాయ సహాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, విజిలెన్స్ అధికారి రామాంజనేయ రెడ్డి, ఎరువుల కంపెనీ ప్రతినిధులు మురళి, ఉమామహేశ్వర్ రెడ్డిలతో జిల్లాలో ఎరువుల సరఫరాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో యూరియా- 7969 మెట్రిక్ టన్నులు, డిఏపి - 1086 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ - 5877 మెట్రిక్ టన్నులు, ఎస్ ఎస్ పి-1328 మెట్రిక్ టన్నులు అందుబాటులో వున్నాయని సకాలంలో ఎరువుల సరఫరా చేయాలన్నారు. యూరియా కార్డు ద్వారా ప్రతి రైతుకి ఎకరాకి 3 బస్తాలు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు.

కామ్రేడ్ సురేష్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతి జిల్లా, సిఐటియు గూడూరు పట్టణ మాజి ప్రధాన కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ సైదాపల్లి సురేష్ మృతి ఉద్యమానికి తీరని లోటని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి పి.మునిరాజలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కామ్రేడ్ సైదాపల్లి సురేష్ కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధితో ఇబ్బంది పడుతూ వైద్యం పొందుతున్నారని తెలిపారు. విద్యార్థి దశ నుండి వామపక్ష భావాలకు ఆకర్షితులై పార్టీలో చేరి పోరాటాలకు కృషి చేశారన్నారు. మొదట ఆర్టీసీలో ఉద్యోగిగా ఉండి సేవలు అందించారని తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నారని తెలిపారు. అందరితో స్నేహపూర్వకంగా ఉండే సురేష్ మృతిచెందడం పార్టీకి తీరని లోటని స్పష్టం చేశారు. సురేష్ మృతిపట్ల సిపిఎం, సిఐటియు, కేవీపీఎస్, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ సిఐటియు సీనియర్ నాయకులు టి. వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, కెవిపిఎస్ అధ్యక్ష,కార్యదర్శులు అడపాల ప్రసాద్, పామంజి మనీ, బి.చంద్రయ్య భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, గండికోట మధు, ఏకోలు వెంకటరమణయ్య, బి.నారాయణ, బి.చంద్రయ్య, ఎస్.కే. జిలాని, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్ నేతలు

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: గూడూరు సిపిఎం నాయకులు కార్మిక సంఘంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ సురేష్ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతికి భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తిరుపతి జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. విద్యార్థి దశ నుండే కామ్రేడ్ సురేష్ ప్రజా ఉద్యమాలపై పట్ల ఆకర్షితులై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి విచ్చేశారని ప్రకటనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలియజేశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారని, చిన్న వయసులోని మరణించడం కార్మిక ఉద్యమానికి నష్టమని తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.


కామ్రేడ్ సైదాపల్లి సురేష్ (ఫైల్ ఫోటో)

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేస్తే
శక్తి వినియోగం తగ్గుతుంది



వర్క్‌షాపులో మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రభుత్వ నిబంధనల మేరకు నగరంలో భవన నిర్మాణాలు చేయడం వలన శక్తి వినియోగం తగ్గించుకోవచ్చునని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కచ్చపి ఆడిటోరియంలో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ బృందం తిరుపతిలో జోనింగ్ నియమాలు – శక్తి సామర్థ్య అధ్యయనంపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ (ఇంచార్జ్), నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్యలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతిలో శక్తి వినియోగం ఏ మేరకు జరుగుతోందనే విషయంపై స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ బృందం సర్వే నిర్వహించారని తెలిపారు. నగరంలో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేయడం వలన శక్తి వినియోగం ఎక్కువ అవుతోందన్నారు. నగరంలో పచ్చదనం పెంచి, కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నగరంలోని అందరూ పి.ఎం. సూర్య ఘర్ సోలార్ వినియోగిస్తే పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరమాన్నారు. జాయింట్ కలెక్టర్ (ఇంచార్జ్), నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ అమృత్ సెంటర్ ఆఫ్ అర్బన్ ప్లానింగ్ ఫర్ కేపాసిటీ బిల్డింగ్ ఆధ్వర్యంలో, గృహనిర్మాణ–నగర వ్యవహారాల మంత్రిత్వశాఖ నిధులతో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఎనర్జీ ఎఫిషెన్సీ కన్సిడరేషన్స్ ఇన్ జోనింగ్ రెగ్యులేషన్స్ –ఎ స్టడీ ఆఫ్ తిరుపతి" అనే ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. నగరంలో శక్తి వినియోగంపై సుమారు ఏడు నెలల పాటు సర్వే నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా భవన నిర్మాణాలు చేయడం వలన శక్తి వినియోగం ఎక్కువ అవుతోందని తెలిపారు. నగరపాలక సంస్థ, తుడా పరిధిలో ఆగస్టు నెలాఖరు నుండి శాటిలైట్ ద్వారా భవన నిర్మాణాలను గుర్తించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులతో భవన నిర్మాణాలు సాగిస్తే శక్తి వినియోగం తగ్గుతుందని తెలిపారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కార్యశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తుడా సిపిఓ దేవికుమారి, నగరపాలక సంస్థ ఏసీపీ లు మూర్తి, మధు, మునిసిపల్, తుడా అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకోండి

- పరిహారాన్ని పెంచండి .. జిల్లా కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో తుపానుతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని, నష్ట పరిహారాన్ని రూ.5 వేలకు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌తో మాట్లాడుతూ తుపాను ప్రభావ ప్రాంతాల్లో తీవ్రమైన నష్టం జరిగిందని, 1000 ఎకరాలపైగా పంటలు దెబ్బతిన్నాయని అనేక ప్రాంతాల్లో కల్వర్టులు, కాలువలు, రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని దీని కారణంగా ప్రజలకు బయటకి రాలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇళ్ల నుండి బయటికి రాలేని వాళ్లకు కూడా పరిహారం చెల్లించాలని గతంలో ఇళ్లలోకి నీళ్లు వచ్చిన ప్రతి కుటుంబానికి పరిహారం చెల్లించాలని ప్రస్తుతం పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి మాత్రమే ఈ పరిహారం చెల్లించడం సరికాదని తెలిపారు. పరిహారాన్ని 3,000 నుండి 5వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని కోరారు. పంట నష్టపోయిన వారికి ఎకరాకు 30 వేల రూపాయలు చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌ల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని వాపోయారు. యుద్ధ ప్రాతిపదికన హాస్టళ్లను బాగు చేయాలని కోరారు. వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో పారిశుధ్యం పూర్తిగా దెబ్బతినింది అంటువ్యాధులు విష జ్వరాలు ప్రబలే పరిస్థితి ఉన్నందున వైద్య సహాయం విస్తారంగా అందించాలని కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో తిరుపతి సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్ ఉన్నారు.


జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

పోలీస్ అమరవీరులకు నివాళి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు కార్యక్రమంగా శుక్రవారం తిరుపతిలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. ర్యాలీ అనంతరం అందరూ పోలీస్ గ్రౌండ్‌లో అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు సమర్పించి, కొవ్వొత్తులు వెలిగించి అంజలి ఘటించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పోలీస్ అధికారులు మాట్లాడుతూ "దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగం ఎప్పటికీ చిరస్మరణీయం. వారి సేవాస్ఫూర్తే ప్రతి పోలీస్ సిబ్బందికి మార్గదర్శకం. సమాజం పట్ల బాధ్యతతో, నిబద్ధతతో పని చేయడం ద్వారానే వారికి నిజమైన నివాళి అర్పించినట్టవుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు సందేశం ఇస్తూ "తిరుపతి జిల్లా పోలీస్ శాఖ తరపున అమరవీరుల కుటుంబాలకు హృదయపూర్వక సంతాపం తెలియజేస్తూ, వారి త్యాగం ఎల్లప్పుడూ మనకు స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రజల భద్రత, సేవే పోలీసులుల ప్రధాన లక్ష్యం."అని అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంలో, జిల్లా ఎస్పీ పిలుపు మేరకు పోలీస్ సిబ్బంది, యువత, ప్రజలు విరివిగా స్పందించి 1175 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని అత్యవసర పరిస్థితులు, ప్రమాద కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులకు ఉపయోగించే విధంగా సదుపాయం కల్పించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల సేవలో ఎల్లప్పుడూ అగ్రగామిగా ఉంటుందని జిల్లా ఎప్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, శ్రీనివాసులరావు, డీఎస్పీలు, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని అమరవీరుల కుటుంబాల పట్ల సంఘీభావం తెలిపారు.

2న ఎల్వీఎం3-ఎం5 ప్రయోగం

- ఇస్రో నుంచి మరో భారీ ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం


ప్రయోగానికి సిద్ధమవుతున్న ఎల్వీఎం3- మిషన్ 5 రాకెట్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి నవంబర్ 2వ తేదీ సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు అంతా సిద్ధం చేశారు. ఈ ప్రయోగానికి సంబంధించి మిషన్ డైరెక్టర్ ఆధ్వర్యంలో అన్ని పరీక్షలు పూర్తిచేసి శుక్రవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్‌లో మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం నిర్వహించారు. లాబ్ చైర్మన్ ఈఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగాన్ని 16.09 నిమిషాల్లోనే ప్రయోగాన్ని పూర్తి చేసేలా శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు. 43.5 మీటర్లు పొడవు కలిగిన ఎల్వీఎం3 రాకెట్ ప్రయోగ సమయంలో 642 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి ఎగరనుంది. 4,400 కిలోలు బరువు కలిగిన సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని భూమికి దూరంగా 29,970 కిలోమీటర్లు, భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు ఎత్తులోని జియో ట్రాన్స్ఫర్ ఆర్బిట్లోకి ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఉపగ్రహాల నియంత్రణ కేంద్రమైన హసన్లోని శాస్త్రవేత్తలు ఉపగ్రహంలోని అపోజి ఇంధనాన్ని మండించి మూడు నాలుగు విడుతల్లో భూమికి 36 వేలు కిలోమీటర్లు ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం భారత భూభాగంతో సహా విస్తృత సముద్ర ప్రాంతంలో సేవలను అందిస్తుంది. చంద్రయాన్ 3 ప్రయోగానికి కీలకంగా పనిచేసిన మొదటి ఎల్వీఎం 3 రాకెట్‌ను ఈ ప్రయోగంలో ఉపయోగిస్తున్నారు.


ఎన్‌సిసి సేవలు అభినందనీయం


ఎన్‌సిసి అధికారులు, కేడెట్లతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సమాజాభివృద్ధికి ఎన్.సి.సి.క్యాడెట్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ (ఇంచార్జి), నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పేర్కొన్నారు. నేషనల్ యూనిటీ డేను పురస్కరించుకొని శుక్రవారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో తిరుపతి ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎన్ సి సి విద్యార్థులందరూ భారతదేశం చిత్రపటం ఆకారంలో నిలబడి, జాతీయ జెండాను పట్టుకుని దేశ ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉండాలంటూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య పాల్గొని, భారతదేశం చిత్రపటం ఆకారంలో నిల్చున్న ఎన్.సి.సి విద్యార్థులతో కలిసి దేశ ఐక్యతను చాటుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారతదేశ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత కోసం చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎన్.సి.సి అధికారులు , కళాశాలలు, పాఠశాలల ఎన్.సి.సి విద్యార్థులు పాల్గొన్నారు.


స్విమ్స్ ఇన్ ఛార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ శిల్ప కడియాల

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్)లో రేడియాలజి ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ శిల్ప కడియాల ఇన్ ఛార్జి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా నియమితులైనట్టు మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ మేరకు స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం డాక్టర్ శిల్ప కడియాలకు నియాపక పత్రం అందజేశారు. డాక్టర్ శిల్ప కడియాల 2013వ సంవత్సరంలో స్విమ్స్‌లో రేడియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2017లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2023లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. డాక్టర్ శిల్ప కడియాల నియామకం పట్ల స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్, డీన్ డాక్టర్ అలోక్ సచన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్ల ఇతర విభాగాధిపతులు, డాక్టర్లు అభినందనలు తెలియజేశారు.


డాక్టర్ శిల్ప కడియాలకు నియామక పత్రం ఇస్తున్న స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్

ఎస్వీ జూ పార్క్‌లో వాలాబీ మృతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌లో ఒక మగ వాలాబీ మరణించినట్లు జూక్యూరేటర్ సెల్వం తెలిపారు. గుజరాత్‌కు చెందిన రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుండి ఈ ఏడాది ఆగస్టు 27న ఒక జత మీర్‌కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో సహా ఒక జత ఎర్రమెడ గల వాలబీస్‌ను విరాళంగా ఇచ్చారన్నారు. ఈ వాలాబీకి ఆరోగ్యం భాగులేక పోవడంతో మృతి చెందిందన్నారు. ప్రోటోకాల్ ప్రకారం, మృతదేహాన్ని సమగ్ర పోస్ట్‌మార్టం పరీక్ష కోసం శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని పాథాలజీ విభాగానికి తరలించామన్నారు. మరణానికి కారణం టాక్సోప్లాస్మోసిస్ అని నిర్ధారించిన డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌మార్టం నిర్వహించారన్నారు. అనంతరం మృతదేహాన్ని తిరుపతిలోని ఎస్వీ జూలాజికల్ పార్క్‌లోని పోస్ట్‌మార్టం కాంప్లెక్స్‌లో ఖననం చేయడం జరిగిందన్నారు.



ఐఐటిలో.. విద్య, పరిశోధనపై దృష్టి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఐఐటీ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, సెంటర్ ఫర్ రిసర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ కలిసి పబ్లిక్ పాలసీలో విద్య, పరిశోధనను మరింత బలోపేతం చేయడానికి మూడు రోజుల వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈ వర్క్‌షాపులో పాలసీ మేకర్స్ విజయనంద్, సుబ్రహ్మణ్యం, జులానియా, రాజీవ్ సదానందన్, కుంటే, చంద్రమౌళిలు పాల్గొన్నారు. పేదరికం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, జనాభా, నైపుణ్యాలతో సమన్వయ పడిన ఉన్నత విద్య వంటి ముఖ్య పరిపాలనా అంశాలపై చర్చ జరిగింది. ఐఐటి, సిఆర్‌ఐ ఎస్‌ఎఫ్ పబ్లిక్ పాలసీలో విద్య, పరిశోధన, ప్రచార రంగాల్లో దీర్ఘకాల సహకారం పెంచేందుకు ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ, సిఆర్‌ఐ ఎస్‌ఎఫ్ సంస్థ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఎంఓయు చేసుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా పాఠ్యక్రమ అభివృద్ధి, బోధనా మద్దతు, నిపుణుల భాగస్వామ్యం, ఇంటర్న్‌షిప్స్, సామాజిక డేటా సైన్స్, పాలసీ ఇన్నోవేషన్‌లో సంయుక్త కార్యక్రమాలు చేపడతారు. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో తరగతులకు సామర్థ్య నిర్మాణం మరియు ప్రచార కార్యక్రమాలు చేస్తారు.ఈ వర్క్ షాప్‌లో భారత దేశం నుండి విద్యార్థులు, పరిశోధకులు, అనుభవజ్ఞులు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి దూరం చేసే బాలోత్సవం

నేడు 4వ పర్యాయం తిరుపతిలో..

ప్రజాశక్తి – తిరుపతి (మంగళం) : పిల్లలపై పెరుగుతున్న మానసిక ఒత్తిడిని దూరం చేసే అద్భుత వేదికగా బాలోత్సవం నిలుస్తోంది. పెరుగుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులలో నూతన ఆలోచనలు, క్రీడలకు సంబంధించి కుదింపు.... ఒక్కటే చదువు.... చదువు.... అంటూ విద్యార్థుల ఒత్తిడికి లోను చేసే పరిస్థితుల నుండి మానసికంగా వారి మనోవికాస ఆలోచనలను పెంపొందించడానికి తిరుపతి బాలోత్సవంలో నిర్వహించే వివిధ రకాల కార్యక్రమాలు పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయనున్నాయి. నేడు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్యలచే గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల వేదికగా ఘన బాలోత్సవం ప్రారంభం కానుంది. భావితరాల బంగారు భవిష్యత్తును కాంక్షించే ఎంతోమంది విశ్రాంత ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, సమాజ హితానికి తమ రచనలతో మార్పు కోరేవారు, కవులు, కళాకారులు, కళాభిమానులతో ప్రతి ఏడు ఎంతో సందడిగా కొన్ని వేల మంది విద్యార్థులతో తిరుపతి బాలోత్సవం విజయవంతంగా నిర్వహింపబడుతోంది. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి జీవిత లక్ష్యాలను వారే నిర్ణయించుకునేలా మనోస్థైర్యాన్ని కల్పించడమే తిరుపతి బాలోత్సవం లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది. తిరుపతి బాలోత్సవం ప్రారంభంలో దాదాపు 3 వేల మంది విద్యార్థులతో ప్రారంభమై నేడు నిర్వహింపబడుతున్న 4వ తిరుపతి బాలోత్సవంలో దాదాపుగా పదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనే స్థాయికి చేరింది.



విద్యార్థులలో పోటీతత్వం..

తిరుపతి బాలోత్సవం వేదికగా నిర్వహించే వివిధ రకాల పోటీలతో విద్యతో పాటుగా వివిధ అంశాలలో విద్యార్థుల మధ్య పోటీ తత్వం పెంచుతూ, వారి లక్ష్య సాధనలో ఇదే పంథాను కొనసాగింప చేసే ఆలోచనలు కలిగిస్తుంది. 33 అంశాలపై 77 విభాగాలుగా సబ్ జూనియర్స్ కేటగిరీలో 3, 4, 5 తరగతులు, జూనియర్స్ కేటగిరిలో 6, 7 తరగతులు, సీనియర్స్ కేటగిరీలో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు విద్యా సంబంధమైన పోటీలు, సాంస్కృతిక పోటీలు, హస్తకళలు, క్రీడలు, కథలు రాయడం, బొమ్మకు కథ వ్రాయడం, స్పెల్ బి, గజిబిజి సరి చేద్దాం, తెలుగు దినపత్రిక పఠనం, బెస్ట్ ఫ్రం వేస్ట్, జానపద నృత్యం, బుర్రకథ, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాల ఆలాపన, లఘు నాటికలు ఇలా అనేక అంశాలపై పోటీలు నిర్వహించబోతున్నారు.

తల్లిదండ్రులు ముందుకు రావాలి..

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు సుస్థిరమైన బాట వేయడానికి, మంచి ఆలోచనలతో, మంచి వాక్చాతుర్యాన్ని, ఉన్నత నడవడికను అలవరచుకునేలా తిరుపతి బాలోత్సవం తగిన ప్రేరణ కలిగిస్తుంది. నవంబర్ 1, 2 తేదీలలో రెండు రోజులు పాటు జరిగే తిరుపతి బాలోత్సవం కార్యక్రమానికి నగర ప్రజలకు వారి పిల్లలను తీసుకొని రాగలిగితే స్ఫూర్తిని కలిగించే ఎన్నో అంశాలకు సంబంధించిన వాటిని నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. వినోదం, విజ్ఞానం పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలకు పిల్లలను తీసుకువస్తే వారి ఆలోచనల్లో మార్పులు వచ్చి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేధిస్తారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

బ్యాడ్మింటన్ కోర్టు ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం, మంగళం పరిధిలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళం ట్రెండ్స్ ఫ్రెండ్స్ ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి సందర్శించి, పీఎంశ్రీ క్రీడా వైదానాల అభివృద్ధిలో భాగంగా నిర్మించిన బ్యాడ్మింటన్ కోర్టును శుక్రవారం ప్రారంభించారు. గత సంవత్సర క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. బేస్ బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న రమ్య, తౌఫిక్, అజిత్, జాతీయ జూడో పోటీలలో పాల్గొన్న భావనను ప్రత్యేకంగా అభినందించారు.

అరుంధతి వాడలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) మండలంలోని చియ్యవరం పంచాయతీ అరుంధతి వాడలో గత నాలుగు రోజులుగా తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో బలకు తెరువు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ తాగునీటి కష్టాలు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా మారాయి. అధికారులు తాగు నీటి సమస్య లేకుండా చూడాలని చియ్యవరం పంచాయతీ, అరుంధతి వాడలో తాగునీటి సమస్య తలెత్తిందంటే ఆ పంచాయతీ కార్యదర్శి పనితీరు ఏ విధంగా ఉందో గమనించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో గ్రామస్తులతో నిరసనలు చేపడతామని సిఐటియు నాయకులు పెనగడం గురవయ్య హెచ్చరించారు.

శేషు కుమారి సేవలు అమూల్యం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక బకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిహెచ్ఓ శేషు కుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం పుణ్యఫలమని, అది నా జీవితానికి ఎంతో అదృష్టమన్నారు. వీడ్కోలు సమయంలో హృదయం భారంగా ఉన్నా, సంతోషంతో ఈ ప్రయాణాన్ని ముగిస్తున్నానన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం సిబ్బంది శేషు కుమారి దంపతులను సన్మానించారు.

శ్రీనివాసులుకు పరామర్శ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, వైసీపీ ప్రధాన కార్యదర్శి నంది పుల్లి బాలకృష్ణ తండ్రి, నంది పుల్లి శ్రీనివాసులు అనారోగ్యంతో స్విమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్నారు. ఆయనను శుక్రవారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను హర్షిత్ రెడ్డి కోరారు. హర్షిత్ రెడ్డి వెంట ఆగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు ఓబుల్ రెడ్డిలున్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బిలక్ష్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచులు, మండల శాఖ అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. గ్రామస్థాయిలో పథకాల అమలు, తాగునీటి సరఫరా, రహదారి మరమ్మతులు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శుభ రత్నమ్మ, తహశీల్దార్ శ్రీదేవి, మండల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలో శుక్రవారం ఉడయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయిలో జరగబోయే మోడల్ అసెంబ్లీని పురస్కరించుకొని శుక్రవారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ విజేతలు జై ప్రశాంత్, వైష్ణవి, ద్వితీయ బహుమతి విజేతలు వింధ్యశ్రీ, యశ్వంత్ యశ్వంత్, తృతీయ బహుమతి విజేతలు చరిత, దీపికలు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు సత్యవేడు పాఠశాలలో జరిగే పోటీలకు హాజరుకానున్నారని ఉపాధ్యాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు.

ఉద్యోగ విరమణ సన్మానం

ప్రజాశక్తి - బాలాయపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న దివ్యజ్యోతి శుక్రవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నారాయణ తన సిబ్బందితో కలిసి ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీడీఓ కార్యాలయం డిజి వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కార్డులు రైతు సేవా కేంద్రాల్లో పొందండి

ప్రజాశక్తి - బాలాయపల్లి: యూరియా కావాల్సిన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లను సంప్రదించి కార్డులు పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు, పక్కదారి పట్టకుండా ఉండేందుకు కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు.

బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏపిసిఎన్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ షణ్ముగం ఆదేశాల మేరకు డక్కిలి మండలం లింగసముద్రంలో బయో రిసోర్స్ సెంటర్ ఎన్ఎఫ్ఏ స్వామికొండయ్య చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిఆర్‌సి మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, ఎంటి సుహాశ్రత, ఎల్2 రజిని బి.ఆర్.సి. ఓనర్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు. బి.ఆర్.సి సెంటర్‌లో వరి, మిద్దెలు, మొక్కజొన్న పంటకు సంబంధించిన కషాయాలు, ద్రావణాలు, నవధాన్యాలు, ఎల్లో షీట్లు, సరఫరా చేస్తామని తెలిపారు.

దేవనాథన్ సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశిష్టాద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ప్రొ.కె.ఇ దేవనాథన్ సేవలు శ్లాఘనీయమని వీసీ ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొ. దేవనాథన్ సేవలు అమూల్యమని, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వర్షాకాలంలో విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు, స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రమీలమ్మ సూచించారు. స్థానిక చెంచులక్ష్మి కాలనీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధులపై అవగాహన కల్పించారు.

పేటశ్రీకి అభినందన

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు కలిసి యస్వీయూ తెలుగు అధ్యయన శాఖ పూర్వ ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డికి అభినందనలు తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ వారు ఈ నెల 29వ తేదీ హైదరాబాద్‌లో వారు రాసిన తిరుపతి కథలకు వచన సాహిత్య పురస్కారం అందించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుని విశ్వవిద్యాలయం అధికారులు శాలువాతో సత్కరించి అభినందించారు.

అంతా నాయకుల చేతుల్లోనే..!

- జోరుగా అనుమతుల్లేని కట్టడాలు.. మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- నిబంధనలు పేదలకేనా..? బడా బాబులకు వర్తించవా..?

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట చుట్టుపక్కల అనేక మండలాల్లో, ప్రతి మండలంలోనూ రోజురోజుకీ వస్తున్న కంపెనీలు అందులోనూ మండల పరిధిలోని సెజ్‌లో వందలాది కంపెనీలు ఆ కంపెనీలలో పని చేస్తున్న వేలమందికి నివాస మార్గం నాయుడుపేట పట్టణం ఒక్కటే. ఇదే అదునుగా పట్టణంలో అనుమతులు లేని భారీ కట్టడాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇక్కడ అనుమతులు తీసుకునేది మాత్రం అతి కష్టం మీద సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే చిన్నాచితక పేదవారు మాత్రమే. పట్టణంలో జరుగుతున్న కట్టడాల్లో ఎక్కువ శాతం భారీ నిర్మాణాలే. ఈ నిర్మాణాలలో 70 శాతానికి పైగా అనుమతులు లేని కట్టడాలేనని పట్టణ ప్రణాళిక అధికారే (టిపిఒ) స్వయంగా చెబుతున్నారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మునిసిపాలిటీ ఆదాయానికి ఎంత గండి పడినా, అధికారులు, అధికార, ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించిన దాఖలాల్లేవు. ఈ విషయం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నించినా.. ఆయన కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియదు. కారణం ఆయన ఇక్కడ ఇన్చార్జి అధికారి మాత్రమే. ఇన్చార్జి అధికారి వారంలో ఇక్కడ మూడు రోజులు, సూళ్లూరుపేటలో 3 రోజులు ఉండి విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. కానీ అది జరగడం లేదు.

పట్టణ ప్రణాళిక అధికారి బాలసుబ్రమణ్యం వివరణ

తిరుపతి జిల్లా, నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమవుతు్న అనుమతుల్లేని భారీ కట్టడాలపై నాయుడుపేట మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారి (టిపిఒ) బాలసుబ్రమణ్యంను వివరణ కోరగా పై విధంగా స్పందించారు. పట్టణంలో జరుగుతున్న అనుమతులు లేని కట్టడాలను ఎలా అనుమతిస్తున్నారు, వాటిని ఎందుకు అడ్డుకోవడం లేదు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, నాయుడుపేట ప్రజాశక్తి ప్రతినిధి ఆయనను ఫోనులో ప్రశ్నించగా టిపిఒ మాట్లాడుతూ ఇక్కడ అసలు ఏది అధికారుల చేతుల్లో ఉండదని ఏదైనా అధికార పక్ష నాయకులు చెప్పినట్లు జరగాల్సిందేనని స్పష్టం చేశారు. అనుమతుల్లేని నిర్మాణాలు చేపడుతున్న వారిని ఎన్నిసార్లు హెచ్చరించినా వారు లెక్క చేయడం లేదని తెలిపారు. నాయకుల అండతో తమపై తిరగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల అనుమతి లేనిదే ముందుకు వెళ్లే పరిస్థితి ఉందని, మనసు చంపుకుని పనిచేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గంలో పని చేయాలన్న ఆలోచన కూడా చచ్చిపోయిందని నాయుడుపేట పట్టణ ప్రణాళిక అధికారి బాలసుబ్రమణ్యం తెలియజేశారు. ■

నెట్ బాల్ పోటీలకు పుత్తూరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తమిళ్ పుత్తూరు విద్యార్థులు వాల్మీకిపురం మండలం, కొత్త మంచూరు ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి అండర్ 17 బాల బాలికల ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌యం స్వరూప తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందాం



రచ్చబండ కార్యక్రమంలో కిలివేటి సంజీవయ్య

ప్రజాశక్తి - నాయుడుపేట: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి కాకాని సూచల మేరకు నాయుడుపేటలోని 7వ వార్డు అగ్రహారపేట, 8వ వార్డు రాజుగోపాలపురం ప్రాంతాల్లో వైసీపీ నాయకులతో కలిసి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇంటింటికీ వెళ్లి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబీరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ తంబీరెడ్డి జనార్దన్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణా రెడ్డి, చదలవాడ కుమార్, కటకం జయరామయ్య, 7,8 వార్డుల కౌన్సిలర్లు గంధవల్లి సిద్దయ్య, బంగారు బాబు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : కోటీ సంతకాలతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందామని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెందోటి కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జయంపు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించండి



కాలనీవాసులతో మాట్లాడుతున పేట బ్రదర్స్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): జనసేన పర్యటనలో భాగంగా శుక్రవారం జనసేన పార్టీ నాయకులు పేట చిరంజీవి, పేట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చిట్టత్తూరు పంచాయతీ గణపతి పురం గిరిజన కాలనీలో పర్యటించి, కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వసులకు గత 35 సంవత్సరాలలో ఏ ప్రభుత్వం కూడా వీరికి పక్కా గృహాలు నిర్మించలేదన్నారు. గత ప్రభుత్వంలో కేవలం ఐదు కుటుంబాలుకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని, అవి ఎక్కడున్నాయో కూడా వారికి తెలియదన్నారు. కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు తెలుపగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీ సమస్యలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, డిప్యూటీ సిఎంల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంధం శీను, తేజ, మనీ, ప్రదీప్ కుమార్, కల్లిపూడి వెంకటేష్, దినేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పిస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" ర్యాలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి పోలీస్ గ్రౌండ్ నుండి ఎంఆర్ పల్లి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీలు పటేల్‌కు నివాళులర్పించారు.

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, పోలీసు సిబ్బందితో ఐక్యతా పరుగు శుక్రవారం పాకాల సీ.ఐ సుదర్శన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 200 మంది ఐక్యతా పరుగులో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఏక్తా దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలో పోలీసులు శుక్రవారం 2కెరన్ నిర్వహించారు. గూడరు బైపాస్ సర్కిల్ నుండి 2కెరన్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - నాగలాపురం: పటేల్ జయంతిని పురస్కరించుకుని దేశ ఐక్యతకు చిహ్నంగా మండలంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సత్యవేడు సీఐ మురళి నాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసి బస్టాండు నుంచి సాయి బాబా ఆలయం వరకు రెండు కిలో మీటర్ల పరుగు కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఏకతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని దిగువ సాంబయ్య పాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పటేల్ జయంతిని ప్రధానోపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. పటేల్‌కి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆర్ సి పురంలో శుక్రవారం ఉదయం పోలీసుల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు, ఐక్యతా పరుగు, ప్రతిజ్ఞ, కార్యక్రమాలు నిర్వహించారు. వెరిటాస్ సైనిక స్కూల్ విద్యార్థులు, యువత, పోలీసులు ఏక్తా దివస్ సందర్భంగా ఐక్యతా పరుగు ర్యాలీ చేపట్టి ఆర్ సి పురం ప్రధాన కూడలి వద్ద మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారి చెంచు బాబు ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను పురస్కరించుకొని శుక్రవారం అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు 2కె రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డి ఎస్ పి చెంచు బాబు, పురపాలక సంఘం కమిషనర్ ఫజులుల్లా, మండల విద్యాశాఖ అధికారి మునిరత్నం చేతుల మీదుగా ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం సర్కిల్ వద్ద నుండి ప్రారంభించారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: పటేల్ జయంతిని పురస్కరించుకుని, అమరవీరుల సంస్మరణ దినోత్సవం నేపథ్యంలో తిరుపతి జిల్లా, చంద్రగిరిలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు.

ప్రజాశక్తి - క్యాంపస్: రాష్ట్రీయ ఏక్తా దివస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా "సర్దార్ఏ150 యూనిటీ మార్చ్ నిర్వహించి, జాతీయ ఐక్యత కోసం తిరుపతిలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. అనిత, డా. హేమావతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. పటేల్ జయంతి సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు, అధ్యాపకులుప్రిన్సిపాల్ భువనేశ్వరి నేతృత్వంలో ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో అంబేద్కర్ సర్కిల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

పార్టీలకు అతీతంగా పనులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ హరి, వైస్ చైర్మన్ డి జయ ప్రకాష్‌ల అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అజెండా చదివి వినిపించారు. కౌన్సిలర్లు ఏకాంబరం మాట్లాడుతూ 22,23,24 వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ హరి మాట్లాడుతూ వాకర్స్‌కు మౌలిక వసుతులు కల్పించాలని, పార్కులు బాగు చేయాలని కోరారు. సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణ పనులు టీడీపీ వారికే ఇస్తున్నారని, వివక్ష చూపరాదని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ, డిఈ లోకేష్, ఏఈ రమేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - వెంకటగిరి : వెంకటగిరి అర్బన్, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాలతో కలిపి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌కు వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వైసిపి నాయకులతో కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు వెనుకబడి ఉన్న వెంకటగిరిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను జిల్లా కలెక్టర్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అంతకుముందు ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - రామచంద్రపురం : ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మధుసూదన్ రావు కోరారు. శుక్రవారం మండలంలోని కుప్పం బాదూరు ఎస్టి కాలనీలో ఎస్సీ, ఎస్టీ పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, రేషన్ కార్డు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకుంటే పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి వి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల లోని చేర్పించాలన్నారు. ఎస్సై భక్తవత్సలం మాట్లాడుతూ గ్రామాలలో శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. ట్రాన్స్కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల గృహ అవసరాలకు ఉచిత విద్యుత్తు అందజేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు ఇవ్వండి

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మహిళా కార్యాలయంలో ఉన్నతి, శ్రీనిధి, ఫిష్ కల్టివేషన్, వెదురు పెంపకం, ఎఫ్‌పిఓ మోరింగా, బ్యాంకు లింకుపై సిబ్బంది ఇసుక తాగేలిలో మహిళలు శిక్షణ పొందుతున్న ఆర్య వర్క్, మగ్గం, పెయింటింగ్ మరియు పాపా నాయుడు పేటలో ఏర్పాటైన నేటివ్ అరకు కాఫీ షాప్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మహిళల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకు రుణాలను ఇవ్వాలని ఎస్‌జిబి పాపానాయుడు పేట బ్యాంక్ మేనేజర్‌ను కోరారు.

పరశురామేశ్వర సన్నిధిలో జబర్దస్త్ నటుడు

ప్రజాశక్తి- గుడిమల్లం : శ్రీ పరశురామేశ్వర ఆలయ దర్శనార్థం జబర్దస్త్ నటుడు సద్దాం మిత్ర బృందం శుక్రవారం విచ్చేశారు. వీరికి ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, వినాయక మండపం వద్ద ఆశీర్వచనం ఇవ్వడం జరిగింది.

ముక్కంటికి బంగారు దండ, వెండి బిందె బహూకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామీ, అమ్మవార్లకు హైదరాబాద్ కు చెందిన ఇందిరా కుటుంబం శుక్రవారం 0.96 గ్రాముల బంగారు కాసుల దండ, 650 గ్రాముల వెండి బిందెను వితరణగా అందజేశారు. వాటిని ఆలయ ఈవో బాపిరెడ్డికి అందించారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం కల్పించారు.

సత్యవేడు రెవిన్యూ డిజిజన్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. శుక్రవారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే ఆదిమూలం చేరుకొని ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్లు సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటును సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు పద్దు రాజు, కేవీబి పురం మండలం నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టే సాయిని సత్కరించిన బీసీ నేతలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కొట్టే సాయి ప్రసాద్ ను శుక్రవారం టిడిపి బీసీ విభాగం నేతలు ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా కృషి చేయాలని సూచించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని తరతరాలుగా కొలుస్తూ, ధూప దీప నైవేద్యాలకు ఇతోధికంగా తోడ్పడి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన వివిధ వర్గాలకు చెందిన వారిని గుర్తించి, వారికి ఆలయంలో నిర్వహించే పూజాది కార్యక్రమాలలో తగిన ప్రాధాన్యత కల్పించేలా ధర్మకర్తల మండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. డా.జి.దశరధాచారి, డాక్టర్ ఎం.ఉమేష్ రావు, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. నగరంలో పలు ప్రాంతాల్లో జెండాలు ఆవిష్కరించారు. బైరాగి పట్టెడ సిపిఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం గందమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో జరిగిన సెమినార్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన తెచ్చుకుని పరిష్కారానికి సంఘటిత పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే రాధాకృష్ణ, నగర కార్యదర్శి ఎన్ డి రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: శుక్రవారం ఏఐటీయూసీ 106వ ఆవిర్భవ దినోత్సవాన్ని కార్మికుల ఆధ్వర్యంలో చంద్రగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ కార్మికులను ఐక్యం చేసేందుకు ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గం ఇన్చార్జి కే వై రాజు, మండల నాయకులు రవిచంద్ర, రవి, బాల, మణికంఠ, మునయ్య, పరంధామ, రాజేంద్ర అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని పుత్తూరు ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పుత్తూరు మండలం భవన నిర్మాణ కార్మికులు, హమాలి కార్మికులు, పుత్తూరు మండల అధ్యక్షులు గోపి ఆధ్వర్యంలో ఏఐటియుసి జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిదులుగా ఏఐటియుసి జిల్లా సమితి సభ్యులు మహేష్, మండల కార్యదర్శి చంద్రబాబులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టౌన్ సెక్రెటరీ చిందుకూరు బాలాజీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు మద్దతుగా ఏఐటీయుసీ అలుపెరుగని పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక, నాయకులు, కందప్ప, నరేష్, నాగేశ్వరరావు, రాజేష్, మునిరాజా, జానాశ్రీను, వేణు, సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు నగరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్, మాజీ కౌన్సిలర్, సికే కార్తికేయన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప దార్శనీకురాలు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బత్తెయ్య నాయుడు కొనియాడారు. స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగూరయ్య, ప్రకాష్ రావ్, కరీముల్లా, శ్రీనివాసులు, రాజయ్య, వానమ్మ, బాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు.

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టర్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని విద్యుత్ కార్యాలయంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన లైన్మెన్‌గా పనిచేస్తున్న కిన్నెర సాంబయ్య(41) శుక్రవారం ఉదయం తన విధి నిర్వహణలో భాగంగా లక్ష్మీపురం కాలనీ ప్రక్కన ఉన్న పొలం దగ్గర విద్యుత్ జంపర్లు పనిచేస్తుండగా ఎల్ సి తీసుకోకుండా పనిచేస్తుండడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సాంబయ్య మృతికి వివరాలు తెలుసుకొన్నారు. మృత దేహాన్ని శ్రీకాళహస్తి ఏరియాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

- బాలికపై లైంగిక దాడికి యత్నం
- వృద్ధుడిపై కేసు నమోదు
- నిందితుడిపై చట్టపరమైన చర్యలు చేపడతాం
- తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానికుల వివరాల మేరకు పట్టణానికి చెందిన పెంచలయ్య అనే వ్యక్తి కాలుకి సెల్యులైటీస్ ఇన్ఫెక్షన్ కారణంతో నెల క్రితం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జాయిన్ అయ్యాడు. రెండు రోజుల క్రితం కాలికి ఆపరేషన్ కూడా జరిగింది. దీంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఓ వార్డులో చికిత్సపొందుతున్నాడు. ఇతనికి తోడుగా వారి కుటుంబసభ్యులతోపాటు ఒక బాలిక ఉంటోంది. అదే వార్డులో పట్టణానికి చెందిన షేక్ సుభాన్ కోమాలో ఉన్న వ్యక్తిని వారం క్రితం అతని దూరపు బంధువులు ఏరియా ఆసుపత్రిలో జాయిన్ చేశారు. అతనికి తోడుగా జమీర్ అనే వృద్ధుడు ఉంటున్నాడు. ఈ సుభాన్ అనే వ్యక్తి హెపాటిక్ యాన్సిసియాలోపతితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి బాలిక నిద్రిస్తుండగా జమీర్ లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది, స్థానికులు వృద్ధుడికి దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఆసుపత్రిలో సిసి కెమెరాలు పని చేయడం లేదని, మరమ్మతులకు గురయినా పట్టించుకునే వాడు లేడని బాధితులు ఆరోపించారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శుక్రవారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్టేషన్లో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఈ సంఘటనకు సంబంధించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరిగిన సంఘటనకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణ చేపట్టామని, నిందుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపడుతామని ఎస్పీ వెల్లడించారు. ఈ విచారణలో ఏఎస్పీ మనోహరాచారి, డీఎస్పీలు గీతాకుమారి, చెంచు బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీ బొమ్మరాజపురం గ్రామపంచాయతీ పరిధి, ఆది ఆంధ్రవాడ గ్రామంలో తహశీల్దార్ జారీనా ఆధ్వర్యంలో గ్రామ సమస్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి వరద ముంపు గురించి, శ్మశన, డ్రైనేజీ, సంక్షేమ పథకాల లబ్దిపై వివిధ సమస్యలను తెలియజేశారు. తాగు నీటి సమస్యతో అనరోగ్యాలు వస్తున్నాయని శుద్ధిచేసి తాగు నీరు అందించాలని కోరారు. ఎంఆర్ఓ జరీన స్పందిస్తూ కలెక్టర్, ఆర్డీఓలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో డిఎస్టి క్యూర్ సెంటర్ ఆధ్వర్యంలో "జనరేటివ్ ఏఐ ఫర్ టీచర్స్" అనే అంశంపై రెండు రోజుల అధ్యాపకుల డెవలప్మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో నారాయణ, కలిదాస్, సుగన్య, భవాని కుమార్‌లు మాట్లాడుతూ ఏఐ ఉపయోగాలు, అవకాశాలు సవాళ్లు నైతిక అంశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వెంకటకృష్ణ, ఆచార్య వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీటీడీ కళాశాలల సందర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : టిటిడి పాలకమండలి విద్యా కమిటీ సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, టిటిడి విద్యా శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధి కారులు శ్రీ పద్మా వతి డిగ్రీ, జూని యర్, పాలిటెక్నిక్ కళాశాలలను శుక్రవారం సందర్శించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థినిలకు హాస్టల్ సీట్ల పెంపునకై సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అనంతరం పద్మావతి అతిథి గృహంలో విద్యా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోలో టీటీడీ విద్యాశాఖ అధికారి వెంకట సునీలు, ఇంజనీరింగ్ విభాగం వారు పాల్గొన్నారు.